# సాక్షి నంద్యాల

బుధవారం । 31 । జూలై । 2024






## గో సంరక్షణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన పెనమర్తి కీర్తి రూ.1,01,116 విరాళాన్ని ఆలయ ఏఈఓ జి.స్వాములుకి అందజేశారు.



## ఉజ్జయిని నాగసాధువులు

మహానంది: దక్షిణ భారతదేశ తీర్థయాత్రల్లో భాగంగా ఉజ్జయినికి చెందిన నాగసాధువులు మంగళవారం మహానందికి చేరుకున్నారు. వారు కామేశ్వరీదేవి, మహానందీశ్వర్లను దర్శించుకున్నారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,631.72 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :100.679 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :1,31,821 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :93,684 |

## న్యూస్‌రీల్

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్ పాల్

**బేతంచెర్ల:** పేద విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆర్జేడీ శామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం ఆయన గోరుమానుకొండ సమీపంలోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ప్రవేశాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, పాఠశాలలో వసతులు, తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంటర్ విద్యార్థులు భవిష్యత్‌పై దృష్టి సారించి శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట కర్నూలు ఏడీ పాల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియ దాసు ఉన్నారు.

### మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.13.09 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

**బేతంచెర్ల:** మద్దిలేటయ్య క్షేత్రంలో స్వామి, వార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపుల లెక్కింపును మంగళవారం నిర్వహించారు. దేవదాయశాఖ అధికారి బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో 33 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ హుండీ లెక్కింపు ద్వారా క్షేత్రానికి రూ. 13,09,176 నగదు, 10.210 గ్రాముల బంగారు, 510.426 గ్రాముల వెండి వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, వేదపండితులు అర్చకులు పాల్గొన్నారు.

### ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

**నంద్యాల(న్యూటౌన్):** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి పది, ఇంటర్ తరగతులలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ జిల్లాకోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదిలో చేరేందుకు 14 ఏళ్లు పూర్తయిన వారు, ఇంటర్‌లో చేరేందుకు పది పాసై 15 సంవత్సరాలు పూర్తయిన వారు అర్హులన్నారు. www. apopenschool. ap. gov. inలో ఈనెల 31వ తేదీ నుంచి దరఖాస్తుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఆగస్టు 27వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

### పదోన్నతులు పొందిన వారికి పోస్టింగ్‌లు

**కర్నూలు(అగ్రికల్చర్):** విద్యుత్ శాఖలో ఐదుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(డీఈఈ)కు పదోన్నతులు లభించాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతులు పొందిన వారికి పోస్టింగ్‌లు ఇస్తూ ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన ఐదుగురు తెలంగాణ స్టేట్‌కు అలాట్ అయ్యారు. వీరు తిరిగి ఏపీలోని ఎస్‌పీడీసీఎల్‌కు వచ్చారు. డీఈఈలుగా పనిచేస్తున్న వీరికి ఈఈలు పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చారు.

# పంటకు పచ్చ చీడ!

**మార్కెట్‌ను ముంచెత్తుతున్న నకిలీ పురుగు మందులు**

- గుంటూరు టీడీపీ నేతల కంపెనీల స్వైర విహారం
- డీలర్లకు బయో కంపెనీల కమీషన్ల ఎర
- కాలం చెల్లిన పురుగుమందులను అంటగడుతున్న వైనం
- మితిమీరిన వినియోగంతో పంటలకు హాని
- కన్నెత్తి చూడని వ్యవసాయ యంత్రాంగం



ఇటీవల కర్నూలు జిల్లాలో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రత్యేక స్క్వాడ్ అధికారులు

**కర్నూలు(అగ్రికల్చర్):** నిషేధిత పురుగు మందులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. అనుమతిలేని బయో కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా విక్రయాలు చేపడుతూ పంటకు హాని చేస్తున్నాయి. వ్యాపారులకు కమీషన్లు ఎర వేస్తూ కంపెనీలు పబ్బం గడుపుకుంటున్నాయి. జిల్లాలో పత్తి, మిరప, ఉల్లి, మొక్కజొన్న, కంది, వేరుశనగ ప్రధాన పంటలు. ఇటీవల కాలంలో వర్షాలు పడుతుండటంతో చీడపీడల బెడద పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నిషేధిత పురుగు మందులను రైతులకు అంటకడుతున్నారు. వీటిని మోతాదుకు మించి వాడటం వల్ల నష్టం చేకూరే ప్రమాదం నెలకొంది. పురుగు మందుల పిచికారీలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయమై రైతులకు వ్యవసాయ అధికారులు కానీ, పురుగు మందులు విక్రయించే డీలర్లు కానీ అవగాహన కల్పించకపోవడం గమనార్హం. తెగుళ్లు, పురుగుమందులను త్వరగా నివారించుకోవాలనే ఆతృతతో రైతులు మోతాదుకు మించి వీటిని వినియోగిస్తున్నారు. అడ్డగోలు వినియోగం వల్ల పంటలకు మేలుచేసే పురుగులు, కీటకాలు, పక్షులు అంతరించే పరిస్థితి ఏర్పడుతోంది. భూగర్భ జలాలు కలుషితం అవడంతో పాటు పర్యావరణానికి హాని చేకూరుతోంది.

**30.07.24**

నంద్యాల జిల్లా సంజామల మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలోని నాలుగు ఫర్టిలైజర్ షాపుల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. సుంకలమ్మ ఫర్టిలైజర్ దుకాణంలో రూ.2లక్షలు, చెన్నకేశవ ఫర్టిలైజర్ దుకాణంలో రూ.2.70లక్షల విలువైన బయో పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. మారుమూల పల్లెలకు పాకిన ఈ 'బయో'త్పాతం వ్యవసాయాన్ని నాశనం చేస్తోంది.

### రంగంలోకి టీడీపీ నేతల కంపెనీలు

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ నేతల బయో కంపెనీలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే నకిలీలను మార్కెట్‌లోకి దింపినట్లు తెలుస్తోంది. మన ప్రభుత్వం వచ్చింది... వ్యవసాయ అధికారులు మనవైపు రారు.. అమ్మకాలు గణనీయంగా పెంచాలని తమ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. మామూలుగానే జిల్లాలో నకిలీలు, దొంగ బయోలు స్వైరవిహారం చేస్తున్నాయి. తాజాగా టీడీపీ నేతలకు సంబంధించిన కంపెనీలు కూడా తోడు కావడం ఆందోళన కలిగిస్తోంది. అడ్డగోలుగా వ్యాపారాలకు కర్నూలు జిల్లా నెలవు అయినప్పటికీ వ్యవసాయ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.



ఎమ్మిగనూరులో సీజ్ చేసిన నకిలీ పురుగు మందులు

### నకిలీలు, దొంగ బయోల వెల్లువ

మార్కెట్‌లో నకిలీ పురుగు మందులు, దొంగ బయోలు ఎక్కువగా ఉన్నాయి. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, గూడూరు, పత్తికొండ, సీ.బెళగల్ తదితర ప్రాంతాలు నకిలీ పురుగుమందులు, దొంగ బయోలకు అడ్డాలుగా మారాయి. వ్యవసాయ అధికారులు వీటిపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఎమ్మిగనూరు ప్రాంతంలో నకిలీలను దర్జాగా షాపుల్లోనే విక్రయిస్తుండటం గమనార్హం. గతేడాది ఎమ్మిగనూరులో దాదాపు రూ.కోటి విలువ నకిలీ పురుగు మందులను వ్యవసాయ శాఖకు చెందిన స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. నిషేధిత పురుగు మందులు, విషపూరితమైన పురుగుమందులు, కాలం చెల్లిన వాటిని కొందరు అక్రమార్కులు పేరు మార్చి బయోలు, ఇతర పురుగుమందుల పేర్లతో మార్కెట్‌లోకి గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేస్తున్నారు. నకిలీలు, దొంగ బయోలపై రైతులు విష ప్రభావానికి లోనైనప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఉండదు. డీలర్లు కమీషన్‌లకు ఆశపడి వాటిని విక్రయిస్తూ రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లు దాదాపు 4,500 మంది ఉన్నారు.
- ఈనెల మొదటి పక్షం రోజుల్లో ఒక జిల్లా అధికారులు మరో జిల్లాలో తనిఖీలు నిర్వహించారు.
- వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు కర్నూలు జిల్లాలో వారం రోజుల పాటు ర్యాండమ్‌గా 29 షాపుల్లో తనిఖీలు చేపట్టారు.
- రూ.1.28 కోట్ల విలువ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులపై స్టాప్ సేల్ విధించారు.
- మంత్రాలయంలో ఒక డీలరును సస్పెండ్ చేశారు.
- గత ఏడాది జూలైలో ఎమ్మిగనూరులో దాదాపు రూ.కోటి విలువ నకిలీ పురుగు మందులు సీజ్ చేసి క్రిమినల్ కేసు పెట్టారు.
- అయితే ఈ బాగోతం వెనుక ఎవరున్నారనే విషయాన్ని ఇటు వ్యవసాయ శాఖ కానీ, అటు పోలీసులు కూడా దృష్టి సారించకపోవడం గమనార్హం.



సీజ్ చేసిన నకిలీ పురుగు మందులు

**కాసుల పంట**

బయోల అమ్మకాల్లో కాసుల పంట పండించుకునే అవకాశం ఉండటంతో చాలామంది డీలర్లు కూడా వీటి అమ్మకాలపై మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. రూ.100 ఖర్చు పెట్టి రూ.500 సంపాదించుకునే అవకాశం ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే కొంత మంది డీలర్లే కాలంచెల్లిన పురుగు మందులను బయోల పేరుతో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆకర్షించే ప్యాకింగ్, పేర్లతో బయోలు రైతులను ముంచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 47 కంపెనీలకు చెందిన 603 ఉత్పత్తులకు అనుమతులు ఉన్నాయి. అయితే ఈ కంపెనీల్లో కొన్ని అనుమతి లేని ఉత్పత్తులను కూడా మార్కెట్‌లోకి దించినట్లు తెలుస్తోంది.

### పంటలకు మేలుచేసే పురుగులకు హాని

అధిక విషప్రభావం ఉన్న పురుగు మందులు వాడటం వల్ల రైతులకే కాదు పంటలకు మేలు చేసే పురుగులు అంతరించిపోతున్నాయి. తేనెటీగలు, అక్షింతల పురుగులు, తూనీగలు, కందిరీగలు, అల్లిక పురుగులు, సాలెపురుగులు, పిచ్చుకలు, నెమళ్లు తదితర పంటలకు మేలు చేసే పక్షులు, కీటకాలు మృత్యువాత పడుతున్నాయి. ఇవి పంటలకు హాని చేసే పురుగులను ఆహారంగా తింటూ వాటి తీవ్రతను తగ్గిస్తాయి.

### సమాచారం ఇస్తే చర్యలు



జిల్లాలో నకిలీ పురుగుమందులు, అనుమతి లేని బయోలపై ప్రత్యేక దృష్టి సారించాం. మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు డీలర్ అవుట్‌లెట్స్, గోదాములు, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అనుమతి లేని బయో ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తప్పవు. ఇటీవల చేపట్టిన తనిఖీలో అలాంటి బయో ఉత్పత్తులు లభించలేదు. తగిన సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. – పి.ఎల్.వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

**బొమ్మలసత్రం:** రాష్ట్రంలో ప్రస్తుతం టీడీపీ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా విమర్శించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో వచ్చి 55 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పేదలకు ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు. రెండు హత్యలు, నాలుగు దౌర్జన్యాలతో ముందుకెళ్తుందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశంలో పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ అకౌంట్‌తో సరిపెట్టడం చూస్తే సూపర్ సిక్స్ పథకాలకు మంగళం పాడేందుకు అనే అనుమానం కలుగుతుందన్నారు. తమకు ఓటు వేస్తే సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చంద్రబాబు న మ్మించి ప్రజలను మోసం చేశారన్నారు. తల్లికి వందనం పథకం అమలు చేయకుండా విద్యార్థులకు ఎగనామం పెట్టారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. టీడీపీ 55 రోజుల పాలనలో 36 హత్యలు, 35 ఆత్మహత్యలు, దాదాపు 550 చోట్ల ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, 490 ప్రభుత్వం ఆస్తుల ధ్వంసం 1000 మందిపై దౌర్జన్యం చోటు చేసుకోగా, 2 వేల కుటుంబాలు వలస వెళ్లాయన్నారు. ఇంత విధ్వంసం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఢిల్లీ సాక్షిగా వైఎస్ జగన్ సాక్షాలతో సహా ఫొటోలతో ప్రదర్శించిన ఇంత వరకూ ఎలాంటి శాంతిభద్రల చర్యలు తీసుకోకపోవటం బాధాకరమన్నారు. సమావేశంలో వైఎస్సార్సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ శశికళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతితోనే కేజీబీవీలను సందర్శించాలి

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే విద్యార్థి సంఘాల నాయకులు కేజీబీవీ పాఠశాలల సందర్శనకు వెళ్లాలని డీఈఓ సుధాకర్ రెడ్డి, సర్వశిక్షఅభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ లలిత తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 50 కేజీబీవీల్లో విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మహిళా సిబ్బందిని నియమించామన్నారు. పరిశీలన పేరుతో విద్యార్థి సంఘాల నాయకులు కేజీబీవీలోకి అనుమతి లేకుండా ప్రవేశించరాదన్నారు. విధుల్లో ఉన్న ప్రిన్సిపాళ్లు జిల్లా ఉన్నతాధికారుల అనుమతి లేనిది లోపలికి ఎవరినీ అనుమతించరాదని సూచించారు.

# బాలిక హత్య కేసు దర్యాప్తుపై నీలి నీడలు?

- మూడు వారాలైనా లభించని మృతదేహం
- గాలింపు చర్యలను నిలిపివేసిన అధికారులు

**సాక్షి, నంద్యాల:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసు దర్యాప్తుపై నీలి నీడలు అలుముకుంటున్నాయి. మూడు వారాలు గడిచినా పోలీసులు బాలిక మృతదేహాన్ని గుర్తించలేదు. ఈ ఘటనలో నిందితులైన ముగ్గురు మైనర్లు ఇచ్చిన సమాచారం మేరకు నేరంలో పాల్గొన్న ఇద్దరు నిందితులను ఈ నెల 16న పోలీసులు అరెస్ట్ చేశారు. నందికొట్కూరులో జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఇటీవల ప్రెస్‌మీట్‌లో నిందితుల వివరాలను వెల్లడించారు. మైనర్ బాలురుల్లో ఒకరి తండ్రి కాటం యోహాన్, మరొకరి పెద్దనాన్న బొల్లెద్దుల సద్గురుడుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి వీరిద్దరికి జూలై 30 వరకు రిమాండ్ విధించారు. అలాగే నేరానికి పాల్పడిన ముగ్గురు మైనర్లకు ఆగస్టు 9వ తేదీ వరకు జడ్జి రిమాండ్ విధించారు. ఈ నెల 20న లాకప్‌డెత్‌కు గురైన హుస్సేన్, అతని సోదరుడు ప్రభుదాస్ కూడా కేసులో ప్రధాన నిందితులుగా ఉన్నారు. ప్రభుదాస్ రిమాండ్ ఆగస్టు 2వ తేదీ వరకు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. పోలీసుల విచారణలో బాలిక మృతదేహాన్ని కృష్ణా నదిలో పడేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. అయితే బాలిక శవం లభ్యం కాకపోవడంతో ఏం చేయాలో పాలుపోక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. బాలిక మృతదేహం కోసం ఎస్డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, స్పెషల్ పార్టీ బృందాలు, డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు, గజ ఈతగాళ్ల సాయంతో గాలించినా ఆచూకీ లభించలేదు. కనీసం ఆనవాళ్లు లభించకపోవడంతో అన్‌ట్రేస్‌డ్ బాడీగా నమోదు చేసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

### గాలింపు చర్యలు ముగింపు

ముచ్చుమర్రి లింక్ చానల్, కొత్తపల్లి సమీపంలోని శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో రెండు వారాల పాటు పోలీసు సిబ్బంది గాలింపు చేపట్టారు. స్పీడ్ బోట్లు, వలలు, తెప్పల సాయంతో వెతికినా ఫలితం కనిపించలేదు. దీంతో ఇక గాలింపు చర్యలకు ముగింపు పలికారు. అసెంబ్లీ సమావేశాలు సాగుతున్న సమయంలో ఏమైనా ప్రశ్నలు ఉత్పన్నమవుతాయనే ఉద్దేశంతో గత సోమవారం నుంచి శనివారం వరకు తూతూ మంత్రంగా గాలించారు. సమావేశాలు ముగిసిన వెంటనే సిబ్బంది గాలింపును నిలిపివేశారు. గాలింపు చర్యలు నిలిపివేయడంతో తమను వెనక్కు పంపించాలని ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కోరుతున్నారు.

### మంత్రి గారూ.. పరామర్శ ఏదీ?

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నా హోంమంత్రి అనిత స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆమె కేవలం రబ్బర్ స్టాంపులా మారారని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. తొమ్మిదేళ్ల చిన్నారి అత్యంత పాశవికంగా హత్యకు గురై మూడు వారాలు గడిచినా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న హోంమంత్రి సంఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించకపోవడం, బాలిక తల్లిదండ్రులను పరామర్శించకపోవడంతో ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీశైలం మల్లన్న దర్శనంతో పాటు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు ఆగస్టు 1వ తేదీన శ్రీశైలానికి రానున్నారు. ఈ నేపథ్యంలో బాలిక హత్యపై స్పందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### జాలరి మృతదేహం లభ్యం


బాలదస్తగిరి (ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని గుంజలపాడు రహదారి పక్కన ఉన్న నీటి కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన జాలరి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మండలంలోని అమడాల గ్రామానికి చెందిన బాలదస్తగిరి (45) ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదశాత్తు నీటి కుంటలో పడి పోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుంట గట్టున బైక్ చెప్పులు, బట్టలు ఉండటంతో కుంటలో పడి ఉంటాడని భావించి తెప్పల సాయంతో కుంటలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### యాచకుడి దుర్మరణం

ఆలూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు దుర్మరణం చెందాడు. మంగళవారం తెల్లవారు జామున హైవే 167లో మండలంలోని కురువళ్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో యాచకుడు హైవేలో నడుచుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మణం పాలయ్యాడు. గ్రామస్తుల సమాచారంతో ఏఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడి వివరాలు లభించకపోవడంతో వీఆర్వో సమక్షంలో శవ పంచనామా నిర్వహించి శ్మశానంలో ఖననం చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేషు తెలిపారు.

### నేడు పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): పాలిసెట్ - 2024 కౌన్సెలింగ్‌లో భర్తీ చేయగా మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి బుధవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లను చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 పాలిసెట్ పరీక్షకు హాజరైన వారితో పాటుగా హాజరు కాని వారు కూడా ఈ స్పాట్ అడ్మిషన్‌లో పాల్గొని సీటు పొందవచ్చని చెప్పారు.

### పెన్షన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కర్నూలు (సెంట్రల్): పెన్షన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. మంగళవారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పెన్షన్ పంపిణీపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పింఛన్ల పంపిణీకి జిల్లాలోని 2,43,337 లబ్ధిదారులకు రూ.103.54 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 1న ఉదయం 6 గంటలకే పెన్షన్ పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులు మాత్రమే పెన్షన్ పంపిణీని యాప్‌లో అప్‌డేట్ చేసేందుకు వీలవుతుందనే విషయాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా, ఎల్‌డీఎం రామచంద్రరావు, మెప్మా పీడీ నాగశివలీల పాల్గొన్నారు.


శ్రీశైలం డ్యామ్ నుంచి దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణా జలాలు

## కృష్ణమ్మ పరవళ్లు

కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతుండటంతో శ్రీశైలం డ్యామ్ నుంచి నీటి విడుదలను పెంచారు. కృష్ణా బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురిసి శ్రీశైలంకు వరద పోటెత్తడంతో మంగళవారం 10 గేట్లను పది అడుగుల మేరకు తెరచి 2,75,700 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. రాత్రి 9 గంటల సమయానికి డ్యాం నీటి మట్టం 883.90 అడుగులకు చేరుకుంది. - శ్రీశైలంప్రాజెక్ట్

# పర్యాటకుల పరవశం


డ్యామ్ వ్యూ పాయింట్ వద్ద సందర్శకులు


డ్యామ్ రహదారిలో బారులుదీరిన వాహనాలు

శ్రీశైలంప్రాజెక్ట్: కృష్ణమ్మ పరవళ్లను తిలకిస్తూ పర్యాటకులు పరవశం చెందుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు భారీగా వరద రావడంతో సోమవారం నుంచి గేట్లను పైకెత్తిసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో జలాశయం స్పిల్‌వే నుంచి బేసిన్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ఉవ్వెత్తున్న పైకి ఎగిసిపడుతున్న అందాలను సందర్శకులు ఆస్వాదిస్తున్నారు. ఈ దృశ్యాలను పర్యాటకులు సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. డ్యామ్ వ్యూ పాయింట్ వద్ద రద్దీ కనిపిస్తోంది.

### డ్యామ్ నిర్మాణం అద్భుతం



ఆంధ్రప్రాంతంలో వివిధ ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శన కోసం మా స్నేహితులతో కలిసి సోమవారం శ్రీశైలం వచ్చాం. శ్రీశైలం డ్యాం గేట్లు తెరవడంతో ఇక్కడికి వచ్చాం. డ్యామ్ నిర్మాణం చాలా అద్భుతంగా ఉంది. నీరు కిందకు పారుతున్న దృశ్యాలను చూడటం అదృష్టంగా భావిస్తున్నాం. చాలా ఆనందంగా ఉంది.
- వినుత, బెంగుళూరు

### పిల్లలు చాలా ఎంజాయ్ చేశారు



మేము చాలా సార్లు శ్రీశైలం వచ్చాం. ఎప్పుడు డ్యాం గేట్లను తెరచినది చూడలేదు. కాని మొదటి సారి దైవదర్శనంతో పాటు కృష్ణానది పరుగులను చూడడం ఆనందంగా ఉంది. పిల్లలు చాలా ఎంజాయ్ చేస్తున్నారు. డ్యాం నుంచి జాలువారే కృష్ణవేణి అందాలను చూస్తుంటే మనసు పులకిస్తోంది.
- అరుణ్, సందర్శకులు, సంగారెడ్డి

### తప్పిన ప్రమాదం


కారును బయటకు లాగుతున్న స్థానికులు

శ్రీశైలంప్రాజెక్ట్: డ్యామ్ దిగువలో మంగళవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా దాదాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ, ఈశ్వర్‌సిద్ధీ, గురుచరణ్ గౌడ్, రమేష్‌లు స్నానం చేసేందుకు మంగళవారం ఉదయం కారులో డ్యామ్ దిగువకు చేరుకున్నారు. అదే సమయంలో డ్యామ్ మరో రెండు గేట్లు తెరవడంతో అకస్మాత్తుగా నీటి ప్రవాహం పెరిగింది. దీంతో కారు నీటి ప్రవాహంలో చిక్కుకొని కొట్టుకుపోతుండగా స్థానికులు గమనించి రక్షించారు.

# 50 రోజుల్లో.. ఆళ్లగడ్డ 20 ఏళ్లు వెనక్కి

- రౌడీ మూకలకు భయపడేది లేదు
- కార్యకర్తలకు అండగా నిలుస్తాం
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: రౌడీ మూకల కారణంగా ప్రశాంతంగా ఉన్న ఆళ్లగడ్డ 50 రోజుల్లో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం ఆళ్లగడ్డ అంటే భయపడే పరిస్థితి ఉండేదని, రెండు నెలల్లోనే మళ్లీ అలాంటి పరిస్థితిని కల్పించారని ఆందోళన వ్యక్తం చేశారు. శిలాఫలకాలు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం తగదన్నారు. తమ హయాంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి శిలాఫకాలు ఏర్పాటు చేశామని, టీడీపీ పాలకులకు చేతనైతే అభివృద్ధి పనులు చేపట్టి ప్రారంభోత్సవాలు చేసుకోవాలని హితవు పలికారు. ఏటా ఈ సమయానికి అమ్మఒడి, రైతు భరోసా నిధులు లబ్ధిదారులకు అందజేసేవారమన్నారు. సూపర్ సిక్స్ అంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రస్తుతం ఒక్క పథకం కూడా ఇచ్చేలా కనిపించడం లేదన్నారు. మోసపు మాటలతో అధికారంలోకి రావడం ఆయన నైజమన్నారు. ఎన్నికల ప్రచారంతో చంద్రబాబు నీకు.. 15 వేలు, నీకు రూ. 15 వేలు అంటూ ప్రచారం చేశారని, అదే స్థాయిలో ఇప్పుడు ఆళ్లగడ్డలో 'నువ్వు రూ.2 వేలు.. నువ్వు రూ.3వేలు.. ఇవ్వాలని వ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఆళ్లగడ్డ శిల్ప కళలకు గొప్ప ఖ్యాతి ఉందని, అలాంటి శిల్పాకళారుల వద్ద నుంచి వసూళ్లు చేస్తుండటం ఎంత వరకు సబబు అన్నారు. ప్రజలు, వ్యాపారుల మీద పడి దోచుకోవాలని చూస్తున్నారే తప్పా చెప్పిన పనులు చేయాలనుకోవడం లేదన్నారు. ఇక నుంచి చూస్తు ఊరుకునేది లేదని ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యకర్తలు ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని, అందరూ ధైర్యంగా బయటకి వచ్చి మాట్లాడాలని పార్టీ, తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు పడకుండా చేస్తామన్నారు.

# హౌసింగ్ పీడీకి తప్పని నిరీక్షణ

- సమయపాలన పాటించని హౌసింగ్ సిబ్బంది


కార్యాలయం వద్ద వేచి ఉన్న పీడీ సిద్ధలింగమూర్తి

కోడుమూరు రూరల్: ఆయన జిల్లా అధికారి. కర్నూలు నుంచి కోడుమూరుకు సమయానికి వచ్చి సిబ్బంది రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఉదయం 10:30 గంటలైనా సిబ్బంది రాకపోవడంతో ఫోన్ చేశారు. వస్తున్నామంటూ తాపీగా సమాధానం ఇవ్వడంతో తీవ్ర అసహనానికి గురై మెమో జారీ చేశారు. హౌసింగ్ సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో పీడీ సిద్ధలింగమూర్తి మంగళవారం ఉదయం పదిన్నరకే కోడుమూరు చేరుకున్నారు. సిబ్బంది కోసం దాదాపు అరగటం వరకు వేచి ఉన్నారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని కళ్లారా చూసిన పీడీ చర్యలకు ఉపక్రమించారు.

**డిసెంబర్‌లోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి**

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీడీ సిద్ధలింగమూర్తి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అర్బన్ స్కీం కింద 37,550 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వాటిలో 17,130 ఇళ్లు నిర్మాణాలు పూర్తికాగా, 20,420 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గ్రామీణ స్కీం కింద 12,383 ఇళ్లు మంజూరు కాగా, 1,664 నిర్మాణాలు పూర్తయ్యాయని, 10,919 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. డిసెంబర్ నాటికి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులు పీడీ సూచించారు.

# మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు


సీనియర్ సివిల్ జడ్జి బి.లీలావెంకటశేషాద్రిని సన్మానిస్తున్న ఆర్‌యూ ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్ తదితరులు

- సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి బి.లీలావెంకట శేషాద్రి

కర్నూలు కల్చరల్: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత నిర్వీర్యమవుతోందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమ విశ్వ విద్యాలయం లైబ్రరీ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా న్యాయ సేవా సంస్థ సమన్వయంతో ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగ నివారణ, ర్యాగింగ్‌ను తరిమికొట్టడం, రహదారి నిబంధనలు పాటించడం, హెల్మెట్ వినియోగం, మహిళల అక్రమ రవాణాను అరికట్టడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ యువతీ యువకులు ప్రతిఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనల మేరకు వాహనాలు నడుపుతూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌యూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ చెడు ఆకర్షణలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువతకు హితువు పలికారు. ఆర్‌టీఓ రమేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, సెబ్ సీఐ రాజేంద్ర ప్రసాద్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం బాధ్యులు శారద తదితరులు మాట్లాడారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం


కర్ణాటక మద్యం పట్టుకున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: కర్ణాటక మద్యాన్ని రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు రామస్వామి, గోపాల్, ఏఎస్ఐ వీరేష్ తెలిపిన వివరాలు.. కడితోట గ్రామానికి చెందిన బి.నాగరాజు 12163 నంబర్ రైలు నుంచి దిగాడు. అనుమానాస్పదంగా ఉండటంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా బ్యాగులో రూ.45000 విలువ చేసే 900 కర్ణాటక ఒరిజినల్ టెట్రా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని, ఎమ్మిగనూర్ ఎస్ఐకి అప్పగించినట్లు వారు తెలిపారు.

### ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

- ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి


మాట్లాడుతున్న డీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోందని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు తెలిపారు. మంగళవారం స్థానిక ఉద్యాన భవన్‌లో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు సలహాలు, సూచనలు ఇచ్చారు. లివింగ్ ఫుడ్స్‌కు హాలహర్వి, హొళగుంద, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం, పెద్ద కడబూరు మండలాలు కేటాయించిందని, ఈ కంపెనీకి ఆయిల్‌పామ్ సాగులో అపారమైన అనుభవం ఉందని, పండించిన ఆయిల్ సీడ్స్‌ను ఈ కంపెనీనే మార్కెటింగ్ చేస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్క ధర రూ.193 ఉండగా.. 100 శాతం సబ్సిడీతో లివింగ్ ఫుడ్స్ కంపెనీ అందజేస్తుందన్నారు. ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలన్నారు. ఆయిల్ పామ్‌లో దేశీవాళీ రకాల సాగుకు ఎకరాకు నాలుగేళ్ల మెయిన్‌టెనెన్స్ కోసం రూ.20 వేలు, ఇంపోర్టెడ్ రకాల సాగుకు రూ.29 వేలు సబ్సిడీ ఇస్తోందన్నారు. నీటి వసతి ఉండి ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం, 1-బి నకళ్లు, 2 పాస్‌ఫొటోలతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. సమావేశంలో లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ రంగనాయకులు, పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయకుమార్, ఉద్యాన అధికారులు అనూష, శ్రీవాణి, మదన్‌మోహన్‌గౌడు పాల్గొన్నారు.

### నల్ల మట్టి అక్రమ తవ్వకాల నిలిపివేత


మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న జిల్లా గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్

కర్నూలు (టౌన్): నల్ల మట్టి అక్రమ తవ్వకాలను మైనింగ్ అధికారులు మంగళవారం నిలిపేశారు. నందవరం మండలం హాలహర్వి గ్రామ పరిధిలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకు వద్ద అనుమతించిన పరిమాణం కన్నా.. ఎక్కువ పరిమాణంలో తవ్వకాలు చేసినట్లు ఫిర్యాదు రావడంతో అక్కడికెళ్లి తనిఖీలు చేశారు. ఎక్కువ మోతాదులో తవ్వకాలకు పాల్పడినట్లు గుర్తించి, ముగతి, ధర్మపురం గ్రామ పరిసరాల్లో నిల్వ ఉంచిన మట్టిని సీజ్ చేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. తనిఖీల్లో సర్వేయర్ మాధవి, నీలప్ప, హుస్సేన్, నందవరం సర్వేయర్ అక్బర్, సచివాలయ సర్వేయర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



### యువకుడి ఆత్మహత్య

గోస్పాడు: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ కుమారుడు మంగళి జనార్దన్ (29) కులవృత్తి చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. కొంతకాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండగా పలు ఆసుపత్రులలో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి గమనించి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి చేసినట్లు గోస్పాడు ఏఎస్ఐ సుబ్రమణ్యం తెలిపారు.



### కోతకు గురైన వీబీఆర్ కట్ట


కోతకు గురైన ప్రాంతం

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్ట ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైంది. ప్రధాన రహదారి వైపు ఉన్న కట్టపై మట్టి వర్షపు నీటికి కొట్టుకు పోయి గుంతలా ఏర్పడింది. అయితే కట్టకు ఎలాంటి ప్రమాదం లేదని, మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలుగు గంగ ఏఈ శివనాయక్ తెలిపారు.

### లారీలో మంటలు

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో పచ్చర్ల సమీపంలో మంగళవారం ఓ లారీలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తెనాలి నుంచి సబ్బుల లోడ్‌తో అనంతపురం వెళ్తున్న లారీ ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై తన వద్ద ఉన్న వాటర్‌బాటిళ్లతో పాటు ప్రయాణికులు ఇచ్చిన నీళ్లతో మంటలను అదుపులోకి తెచ్చాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.


# బంగారు వ్యాపారి కిడ్నాప్ కథ సుఖాంతం

- సినీ ఫక్కీలో పోలీసుల చేజింగ్..
- కిడ్నాపర్ల చెర నుంచి వ్యాపారిని కాపాడిన పోలీసులు
- పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు


కిడ్నాపర్ల చెర నుంచి క్షేమంగా బయటపడ్డ డమామ్ వెంకటేష్

కోడుమూరు రూరల్: గూడూరు పట్టణంలో సోమవారం కిడ్నాపైన బంగారు వ్యాపారి డమామ్ వెంకటేష్ కథ సుఖాంతమైంది. కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో గూడూరు, కె.నాగలాపురం, ఎమ్మిగనూరు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితులు, బాధితుడి సెల్‌ఫోన్ల సిగ్నల్స్ ఆధారంగా గాలింపు చేపట్టారు. డమామ్ వెంకటేష్‌ను కిడ్నాపర్లు తెలివిగా మెయిన్ రోడ్లలో కాకుండా పొలాలకు వెళ్లే దారులు, పవన్ విద్యుత్ వాహనాలు వెళ్లేందుకు వేసిన మట్టి రోడ్ల వెంట తమ వాహనాన్ని తిప్పుతూ కొద్ది సేపు పోలీసులను తికమక పెట్టారు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ప్యాలకుర్తి, చనుగొండ్ల గ్రామాల మధ్య పొలాల రస్తాలో నిందితుల వాహనం వెళ్తున్నట్లు ట్రేస్ అవుట్ చేసి, కె.నాగలాపురం ఎస్ఐ శ్రీనివాసులును అలర్ట్ చేశారు. ఆయన తన సిబ్బందితో ఎదురుగా వెళ్లి నిందితుల వాహనాన్ని తన జీపుతో ఢీకొట్టి ఆపారు. దీంతో కిడ్నాపర్లు వాహనాన్ని, వ్యాపారిని వదిలేసి పారిపోయారు. ఈక్రమంలో ఒక కిడ్నాపర్ పోలీసులకు చిక్కినట్లు సమాచారం. కాగా వ్యాపారికి ముసుగు వేసి కిడ్నాపర్లు పిడిగుద్దులు గుద్దడంతో కంటి వద్ద తీవ్రగాయాలయ్యాయి. కిడ్నాపర్ల చెర నుంచి వ్యాపారిని రక్షించడంలో కె.నాగలాపురం ఎస్ఐ శ్రీనివాసులు చూపిన తెగువను పలువురు పోలీస్ అధికారులు అభినందించారు. అలాగే ఏడు బృందాలుగా ఏర్పడి త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

### కామాంధుడికి దేహశుద్ధి


నిందితుడు తాళేపల్లె కిశోర్

అవుకు: వివాహితను లైంగికంగా వేధిస్తున్న ఓ కామాంధుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన మండల కేంద్రం అవుకులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల మేరకు.. ఓ వివాహిత తన భర్తతో కలిసి ఓ హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ హోటల్ పక్కనే ఉన్న కిరాణం దుకాణ యజమాని తాళేపల్లె కిశోర్.. వివాహితను కొంత కాలంగా వేధిస్తున్నాడు. ఆమె ఫోన్ నంబర్ తెలుసుకుని అసభ్యకర మెసేజ్‌లు, వాయిస్ మెసేజ్‌లు పంపుతూ వేధించేవాడు. ఈ విషయం తెలుసుకున్న వివాహిత భర్త, కుటుంబ సభ్యులు మంగళవారం కిశోర్‌కు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కామాంధుడిని స్టేషన్‌కు తరలించారు. లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు. నిందితుడు కిశోర్ తన దుకాణానికి వచ్చిన మహిళలను ఏక వచనంతో, అసభ్యకరంగా మాట్లాడుతాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతనికి గతంలో నేర చరిత్ర కూడా ఉందని, అధిక బెల్లం నిల్వ కేసుతో పాటు, బ్లూఫిల్మ్ సీడీలు విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడినట్లు చెబుతున్నారు.